ప్రజాశక్తి

బుధవారం 9 అక్టోబర్ 2024

చాపరాయిని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రం చాపరాయి జల విహారిలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్ఎస్జె రవినాథ్ తిల్హారి కుటుంబ సభ్యులతో మంగళవారం సందర్శించారు. జల విహారిలో సందర్శించిన ఆయనకు గిరిజన సంప్రదాయ నృత్యంతో గిరి మహిళలు స్వాతగం పలికారు. జల విహారిలో సరదాగా స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు, పచ్చని అందాలను చూసిన ఆయన మంత్రముగ్ధులయ్యారు.



పర్యాటక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి

ఎన్ఆర్ఇజిఎస్ పనులు వేగవంతం చేయండి

- 14 నుండి పల్లె పండుగ -

జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 14 నుంచి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనుల ప్రగతిని సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్ట్ 23వ తేదీ ఒకేరోజు జిల్లాలోని అన్ని పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులను ప్రారంభించేందుకు, పల్లె పండుగ పేరుతో కొత్త కార్యక్రమం ప్రారంభం కానుందని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా మొదలుపెట్టాలని ఆదేశించారు. అందుకు గాను రూ.275 కోట్ల వేజ్ కంపోనేంట్ కింద, మరో రూ.185 కోట్లు మెటీరియల్ కంపోనేంట్ కింద ప్రతిపాదించడం జరిగిందన్నారు. అక్టోబర్ ఒకటవ తేదీ వరకు వేజెస్ సర్దుబాటు చేయడం జరిగిందని, పెండింగ్ ఉన్న మరో రూ.7.65 కోట్లు త్వరలోనే విడుదల చేస్తారని తెలిపారు. ఆగస్ట్ 23న పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆమోదించిన పనులు ప్రారంభించాలని సూచించారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో గ్రామసభల్లో తీసుకున్న అర్జీలు పరిష్కారం, తీర్మానాల అమలు చేయాలన్నారు. పల్లె పండుగలో సీసీ రోడ్లు, తారు రోడ్లు, వ్యవసాయ కుంటలు, పశువుల శాలలు, ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. సిటిజన్ నాలెడ్జ్ బోర్డులు అందరికీ తెలిసేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. చింతపల్లి మండలంలో ఉపాధి హామీ పనులు తక్కువ జరగడానికి కారణాలపై సమీక్షలో అక్కడి పంచాయతీలో 1329 మంది జాబ్ కార్డులు తొలగించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన లాగిన్ పాస్ వర్డులు ఇతరులకు ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్త పరిచిన కలెక్టర్ సంబంధిత ఎంపిడిఓకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు పది లక్షల మంది ప్రజలు సంతలలో దొరికే వస్తువులు కొనుగోలు చేసి వాటితో చేసిన ఆహారం తింటున్నారన్నారు.

గృహ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, పిఎంఎవై గ్రామీన్ కింద 17,111 గృహాలు మంజూరు కాగా కేవలం 33శాతం మాత్రమే గ్రౌండ్ కావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ త్వరితగతిన గ్రౌండింగ్ చేయించాలని ఆదేశిచారు. ఎన్టీఆర్ హౌసింగ్ కింద మంజూరైన 14,631 గృహాలకు వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. పిఎం జన్మన్ కింద ఇప్పటివరకు 25,363 గృహాలు మంజూరయ్యాయని, మరో 2,646 గృహాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు సచివాలయాలలో సక్రమంగా సేవలు అందించ లేదని మండిపడ్డారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్, డ్వామ పిడి శివయ్య, డిపిఓ కొండలరావు, డివిజినల్ పిఒ కుమార్, హౌసింగ్ పిడి ఎన్.బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ గణేష్ కుమార్, మార్కెటింగ్ ఏడి రాకేశ్, ఆర్ అండ్ బి ఇఇ బాల సుందర బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రహదారి నిర్మాణం చేపట్టాలి

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో లక్ష్మిపేట పంచాయతీ కొదువలస గ్రామానికి పిఎం, జన్మాన్ ఆవాస్ యోజన్ పథకం కింద తారు రోడ్డు నిర్మాణం వెంటనే చెయ్యాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. పెదబయలు మండలం లక్ష్మీ పేట పంచాయతీ కొదువలస పీవీటీజీ గ్రామానికి పిఎం జన్మన్ యోజన పథకంలో పివిటిజిలందరికీ ఇల్లులు, గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మంగళవారం కొదువలస గ్రామంలో కొర్ర నర్సయ్య అధ్యక్షన జరిగిన సమావేశం నిర్వహించారు. అనంతరం రోడ్డును పరిశీలించిన సురేంద్ర మాట్లాడుతూ, కొదువలస గ్రామ రోడ్డు తుపాన్‌కు కొట్టుకు పోయినదని, దీంతో అంబులెన్సు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామానికి నిత్యావసర వస్తువులు తీసుకుని వెళ్ళలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఇల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కె.సర్బన్న, నాగేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న సురేంద్ర

పింఛన్ల పంపిణీలో చేతివాటంపై విచారణ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండలం చట్లవాడ పంచాయతీ డోలగండి గ్రామంలో పింఛన్ల పంపిణీలో వాలంటీర్ చేతివాటం ప్రదర్శించిందని ఆరోపణలు రావడంతో మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. క్లస్టర్ సి-19 వాలంటీర్ పల్లాల విజయలక్ష్మి వాలంటరీగా పనిచేస్తున్న సమయంలో పింఛన్లు పంపిణీ చేయడంలో పింఛన్ల సొమ్ము ఇవ్వకుండా చేతివాటం చూపించించినట్లు సర్పంచ్ ప్రేమలత, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో స్థానికులు ఫిర్యాదు చేశారు. వాలంటీరుపై ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో విచారణ జరపాలని పంచాయతీ కార్యదర్శిని, సిబ్బందిని సర్పంచ్ ప్రేమలత కోరారు. దీంతో అక్కడికి చేరుకున్న సచివాలయ సిబ్బంది ఎంతమంది పెన్షన్ లబ్ధిదారులకు ఇవ్వకుండా వాడుకోవడం జరిగిందనే దానిపై విచారణ చేపట్టారు. సుమారు ఆరుగురు వృద్ధాప్య పింఛన్లు స్వాహా చేసినట్లు గుర్తించారు. ఒకరి పింఛను నాలుగు సంవత్సరాలు, ముగ్గురు పింఛన్లు సంవత్సర కాలం పాటు, ఒకరి పింఛను ఒక నెల ఇవ్వలేదని, ఒకరి వృద్ధాప్య పింఛను రూ.7000 ప్రభుత్వం నుండి మంజూరు కాగా లబ్ధిదారునికి రూ.4000 వేలు మాత్రమే అందించినట్లు విచారణలో సిబ్బంది గుర్తించారు. దీంతో లబ్ధిదారులకు ఇవ్వకుండా స్వాహా చేసిన పింఛను సొమ్మును తిరిగి చెల్లిస్తానని వాలంటీర్ పి.విజయలక్ష్మి హామీ పత్రం ఇచ్చినట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు పెన్షన్ అందుతున్న తీరును పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా పూర్తిగా నిర్లక్ష్యం వహించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డు ప్రక్కన ఉన్న తమ గ్రామంలో ఇలా జరిగిందంటే మారుమూల లోతట్టు గ్రామాల్లో ఇంకా ఎన్ని అక్రమాలు జరిగాయో అనే అనుమానాలు పలువురిలో రేకెత్తుతున్నాయి. మండలంలో అన్ని పంచాయతీల్లో గ్రామాల వారీగా సంబంధిత శాఖ అధికారులు విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మాట్లాడుతున్న డిఎఫ్ఒ భవిత

ముగిసిన వన్య ప్రాణి వారోత్సవాలు

ప్రజాశక్తి-చింతూరు

ఈ నెల 2న ప్రారంభమైన వన్యప్రాణి వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ మేరకు చింతూరు అటవీశాఖ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ముగింపు సభలో డిఎఫ్ఒ భవిత మాట్లాడుతూ అడవితో మమేకమై జీవించాలని, అటవీ జంతువులను సఖ్యతతో చూడాలని సూచించారు. పులులు గర్వంగా సంచరించే రోజులు కోసం సిబ్బంది, ప్రజలు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిగ్నేచర్ క్యాంపియన్, వివిధ క్షేత్రాల సిబ్బందికి క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సబ్ డిఎఫ్ఓ శ్రీనివాస్ రెడ్డి, కూనవరం సబ్ డిఎఫ్ఓ రాఘవరావు, క్షేత్రధికారులు అబ్బాయి దొర, ముత్యాలయ్య, మూర్తి, నానాజీ, అజాద్, డిఆర్ఒ శ్రీనివాస్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

ఎపిటిడిసి ఛైర్మన్ బాలాజీ

ప్రజాశక్తి-పాడేరు/అరకు/అనంతగిరి: విశాఖపట్నం పర్యాటక డివిజన్ తనిఖీలో భాగంగా మంగళవారం ఏజెన్సీలోని పలు పర్యాటక స్థలాలను ఏపీటీడీసీ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో విశాఖపట్నం పర్యాటక డివిజన్లోని అరకు, అనంతగిరి, లంబసింగి యాత్రి నివాస్ యూనిట్లను సందర్శించారు. సోమవారం రాత్రి హరిత రిసార్ట్స్, అనంతగిరిలో బస చేశారు. మంగళవారం ఉదయం అరకు ప్రయాణమై మార్గమధ్యంలో తాటిగూడ జలపాతం, కాఫీ తోటలు, గాలికొండ వ్యూ పాయింట్ కాఫీ మ్యూజియం, గిరిజన మ్యూజియం సందర్శించి అరకు హరిత వాలీ రిసార్ట్స్ లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాడేరు మండలంలోని డల్లాపల్లి, హిల్ స్టేషన్‌కు వెళ్లి కొత్త రిసార్ట్స్ నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతగిరి యాత్రి నివాస్ మయూరి యూనిట్లలో దాదాపు 25 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. పర్యాటక ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని తెలిపారు. గత ప్రభుత్వంలో అనాలోచిత చర్యలతో ఏపీ టూరిజం చాలా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రెండు కోట్లతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారిందన్నారు. పర్యాటక విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల తీరులో కూడా మార్పు రావాలన్నారు. పర్యాటకుల పట్ల మర్యాదతో గౌరవప్రదంగా ప్రవర్తించాలని దేశ విదేశీ ఆకర్షించేలా వినూత్న విధానాలు ఆరంభించాలన్నారు. ఉద్యోగులు, దింసా నృత్య కళాకారులు వారి వారి సమస్యలు వివరించగా వాటికి తగిన పరిష్కారం త్వరలో చూపుతామని తెలిపారు. తరువాత ఆయన హరిత హిల్ రిసార్ట్స్ లంబసింగి చేరుకున్నారు.

థింసా నృత్యాన్ని తిలకిస్తున్న ఎపిటిడిసి ఛైర్మన్ బాలాజీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమావేశాలకు హాజరయ్యే..

వైద్యసిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి

- వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సిఐటియు విజ్ఞప్తి

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి నెల వైద్య సిబ్బందికి, ఆశా వర్కర్లకు నిర్వహించే సమావేశాలకు వసతితో పాటు తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా నాయకుడు ఎల్ సుందర్రావు వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కోరారు. ఈ విషయంపై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, మినుములురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్ల, ఆశా డే మీటింగ్ , స్టాఫ్ సమావేశాలకు ప్రత్యేక షెడ్డు లేదా రూము, మంచి నీరు, బాత్ రూమ్ లేకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన విలేకరులకు వివరించారు. ఆశా వర్కర్లకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి సరైన వసతి లేకపోవడంతో వర్షాలకు తడుస్తూ, వేసవికాలంలో ఎండలకు చెమటలు కార్చుకుంటూ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరు బయటనే సమావేశంలో పాల్గొంటున్నారని తెలిపారు. దీంతో గర్భిణీ, బాలింతలైన ఆశ వర్కర్లు, వయసు పైబడిన వారు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం చేయలేదని తెలిపారు. సమావేశ మందిరానికి సంబంధించి రేకుల షెడ్డును, మంచినీటి సౌకర్యాన్ని, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే సమావేశాలను బహిష్కరించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మాట్లాడుతున్న ఎఒ

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని గుమ్మ పంచాయతీ పరిధి గుమ్మ గ్రామం వద్ద మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారిని ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ పరిధి పలు గ్రామాలకు చెందిన వ్యవసాయ రైతులు హాజరయ్యారు అనంతరం సదస్సులో హాజరైన ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, వ్యవసాయ పంటలపై అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు, పవర్ టిల్లర్లు ఇతర వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ కింద అందిస్తుందని తెలిపారు. అవసరమైన రైతులకు అధికారులు గుర్తించి అందే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం పశువ్యవసాయ శాఖ అధికారి సందీప్ కుమార్ మాట్లాడుతూ, పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులను వివరించారు. మూగజీవులకు ముందస్తు జాగ్రత్తగా టీకాలు క్రమం తప్పకుండా వేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చందర్రావు, గిరిజన సంఘం నాయకుడు జె.భీమన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరద నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలి

ఆకులూరి గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి-సీలేరు

భారీ వర్షాలు, వరదలకు కొట్టుకుపోయిన పంటలకు జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని జీకే వీధి మండలం, గాలికొండ పంచాయతీ, ఆకులూరి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గ్రామస్తులు విలేకర్లతో మాట్లాడుతూ తుఫాన్ వచ్చి సుమారు నెల రోజులైనా ఇంతవరకు ఒక్క అధికారి కూడా తమ గ్రామాన్ని సందర్శించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల వచ్చిన వరదలకు నష్టపోయిన పంటల సర్వే ఇప్పటివరకు అధికారులు చేయలేదని పేర్కొన్నారు. తుఫాన్ కారణంగా కొండ చరియలు విరిగిపడి రహదారులకు అడ్డంగా రాళ్లు, మట్టి చెత్త చెదారం నిలిచిపోవడంతో రాకపోకలకు అనేక ఇబ్బందులు గురవుతున్నామని, వాటిని తొలగించే పని ఇప్పటి వరకు అధికారులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 43 కుటుంబాలు జీవిస్తున్నాయని, రహదారి, మంచినీరు, పాఠశాల భవనం వంటి కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో పింఛన్లను తీసుకోవడానికి నాలుగు కిలోమీటర్లు మేర నడిచి వెళ్ళవలసిన దుస్థితి నెలకొందని వాపోయారు. తమది పివిటిజి (పురజ) గ్రామం అయినప్పటికీ గ్రామం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రధానమంత్రి జన్‌మన్ గ్రామసభలు పేరిట సభలు ఏర్పాటు చేయడం తప్ప తమకు ఒరిగిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిపిఓ స్పందించి తమకు పంట నష్టపరిహారం చెల్లించాలని, రహదారి నిర్మాణం చేసి రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న ఆకులూరి గ్రామస్తులు

వికలాంగుల అభివృద్ధికి

స్వచ్ఛంద సంస్థ ముందుకు రావాలి

సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని వికలాంగులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వివిధ రకాలైన స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక ఐటిడిఎ సమావేశపు హాల్లో ఉమా మనో వికాస కేంద్రం స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా వికలాంగుల పెళ్లి కానుక చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీలోని వికలాంగులకు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆర్థిక తోడ్పాటును అందించాలని కోరారు. ఉమా మనోవికాస్ కేంద్రం స్వచ్ఛంద సంస్థ ద్వారా పెళ్లి చేసుకున్న వికలాంగులు 15 మందికి ఒక్కొక్కరికీ ఐదువేల రూపాయలు చొప్పున, మరో ఐదుగురికి పదివేల రూపాయలు చొప్పున చెక్కులు పంపిణీ అందించారు. కార్యక్రమంలో యస్ఏ నాయుడు, రాంజీ, చిన్ని, సొమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన పెళ్లి కానుకను చెక్కును వికలాంగులకు అందిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం : జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని ఎపి ఇపిడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జియన్.ప్రసాద్ హెచ్చరించారు. అల్లూరి జిల్లా పరిధిలో ఏవిధమైన విద్యుత్ లైన్ల నుండి అయినా ఎవరైనా జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చి మనుషులకు గానీ, పశువులకు గానీ ఏ విధమైన ప్రాణహాని కలిగించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అందువల్ల అటువంటి చర్యలకు పాల్పడే వారి సమాచారం దగ్గరిలో విద్యుత్‌శాఖ కార్యాలయానికి అందించాలని కోరారు.

రాజులు మాస్టర్ దంపతులను సత్కరిస్తున్న సిఐటియు తెలంగాణ నేత సీతామహాలక్ష్మి

ఉద్యోగ విరమణ చేసిన రాజులు మాస్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధి సున్నం వారి గూడెం గ్రామానికి చెందిన సున్నం రాజులు మాస్టర్‌కు తెలంగాణ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సిహెచ్.సీతామహాలక్ష్మి, సిఐటియు నాయకులు మంగళవారం సన్మానం చేశారు. సున్నం రాజులు మాస్టర్ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో సీతామహాలక్ష్మితో పాటు, సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా సహాయ కార్యదర్శి పూనం సత్యనారాయణ, జిల్లా సభ్యులు సున్నం రంగమ్మ మంగళవారం రాజులు మాస్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. పూలగుచ్చం ఇచ్చి సాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ విఆర్.పురం, కూనవరం, చింతూరు, మండలాలలో రాజులు మాస్టారు తెలియని వారు లేరన్నారు. మృధు స్వభావి, ఎవరినీ నొప్పించని మనస్తత్వం, చెదరని చిరునవ్వుతో పాటు ఆత్మవిశ్వాసం ఆయన సొంతమన్నారు. అనేకమంది విద్యార్థులను ఉపాధ్యాయులుగా, బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దిన మహోన్నతమైన వ్యక్తిత్వం కలవారు రాజులు మాస్టర్ అని కొనియాడారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా ఎలా జీవించాలి, ఎలా బతకాలో నేర్పించేవారని, గ్రామం పెద్దలకు గ్రామాభివృద్ధి ఎలా చేసుకోవాలో సాయంత్రం సమయంలో వారికి బోధించేవారని చెప్పారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సర్పంచ్

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారికి ఆ పంచాయతీ సర్పంచ్ పులి సంతోష్ కుమార్ పట్టు వస్త్రాలు, నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు ఇస్తున్న సర్పంచ్ సంతోష్‌కుమార్

రూ.500 నోట్లతో అమ్మవారి అలంకరణ

సీలేరు : జీకే వీధి మండలం దారకొండలో దేవీ నవరాత్రులు మహోత్సవాలు సందర్భంగా మంగళవారం అమ్మవారిని మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దుర్గాదేవిని 500 నోట్లతో భక్తులు అలంకరించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని రోజుకు ఒక రూపంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు దర్శనం కల్పిస్తున్నామని నిర్వాహకులు గొర్ల గణేశ్వర వెల్లడించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

మన్యం అందాలు అద్భుతం

ప్రజాశక్తి -మారేడుమిల్లి:మన్యం అందాలు మన్యానికి మణిహారంగా నిలుస్తున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి అన్నారు. పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతానికి కుటుంబ సమేతంగా ఆమె సందర్శించారు. జలపాతాల అందాలను చూసి ఆనందం వ్యక్తం చేశారు. చుట్టూ పచ్చని కొండల నడుమ జలపాతాలు మన్యానికే శోభనిస్తున్నాయన్నారు. ఉదయం మంచు, సాయంత్రం చల్లని గాలులు మధ్య కొండకోనల్లో జలపాతాలు ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. జలపాతాలో ఆమె సాదారణ వ్యక్తిగా సందర్శించి నిర్వాహకులతో సరదాగా సెల్ఫీలు తీసుకున్నారు. మన్యంలో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఆమె అన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని
కాంట్రాక్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు నిరసన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో ఆసుపత్రి వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి చేస్తున్న నిరసన 48వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు ఎల్.వి. రమణ మాట్లాడుతూ, కార్మికులకు బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని కాంట్రాక్టర్లను ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదని, తాము చెల్లించ లేమని చెబుతున్నారని వాపోయారు. ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజులు కట్ట లేని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించి పే స్లిప్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16వ తేదీ లోపు సమస్యలు పరిష్కారం కాకుంటే సమ్మె తప్పదని, దీనికి అధికారులు బాధ్యత వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్వతి, సత్యవతి, సోమేశ్వరరావు, లక్ష్మి, దుర్గ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయంపూడిలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని న్యాయంపూడి గ్రామంలో మంగళవారం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) ప్రతినిధులు అనిల్ గైక్వాడ్, అనిల్ నిమ్ బోత్కర్లు పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలు ఎస్ హెచ్ జి సభ్యులకు ఏ విధంగా జీవనోపాధి అవసరాలకు ఉపయోగపడుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలతో పలు అంశాలపై చర్చించారు. వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షించారు. రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, సర్పంచ్ రెడ్డి వరహాలబాబు, ఎంపీటీసీ సభ్యులు అకేటి గోవిందరావు, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సచిదేవి, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డైజీ, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్డి సత్యనారాయణ, ఏపీఎం భాగ్యలత, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, డిపిఎం శ్రీనివాస్, ఎసి సత్యవేణి, ఏపిఎం శ్రీనివాసరావు, వెలుపురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సప్పరం వాహనంపై తిరు సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను సప్పరం వాహనంలో గ్రామ తిరు సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

కాఫీ రైతుల సంక్షేమమే లక్ష్యం

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్

ప్రజాశక్తి - చింతపల్లి : కాఫీ రైతుల సంక్షేమమే లక్ష్యమని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ అన్నారు. కాఫీ రైతుల నుండి నాణ్యమైన కాఫీ పళ్లను సేకరించాలని ఆదేశించారు. మంగళవారం చింతపల్లి కాఫీ ఏకో పల్పింగ్ యూనిట్ సమావేశ మందిరంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, హార్టికల్చర్ కన్సల్టెంట్లు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, చింతపల్లి, జి కె వీధి, కొయ్యూరు మండలాల లైజన్ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 నవంబర్ నెల నుండి కాఫీ సేకరణ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. నాణ్యమైన కాఫీ పళ్ళు మాత్రమే సేకరించాలని ఆదేశించారు. 2 వేల టన్నుల కాఫీ పళ్ళను సేకరించడం లక్ష్యంగా నిర్దేశించామని స్పష్టం చేశారు. గత ఏడాది 836 టన్నుల కాఫీ పళ్ళు సేకరించి రైతులకు కేజీకి రూ.43లు చెల్లించడం జరిగిందని చెప్పారు. దానికి అదనంగా కిలో ఒక్కింటికి మూడు రూపాయల చొప్పున రైతులకు బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. గత ఏడాది 189 మెట్రిక్ టన్నుల పార్చ్మెంట్, 33 టన్నుల చెర్రీ ఉత్పత్తి జరిగిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,500 కాఫీ రైతులను గుర్తించడం జరిగిందన్నారు. అనంతగిరి మండలం నుండి 50 టన్నులు, అరకు వ్యాలీ, డుంబ్రిగూడ నుండి 120 టన్నులు, పెదబయలు 120, హుకుంపేట 200, ముంచంగిపుట్టు 100, పాడేరు 120, జి మాడుగుల 350, చింతపల్లి 400 మెట్రిక్ టన్నుల కాఫీని సేకరించాలని ఆదేశించారు. రు.6.50 లక్షల వ్యయంతో కాఫీ ఎక్కువ యూనిట్ లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, కాఫీ సహాయ సంచాలకులు ఎస్.అశోక్, 11 మండలాల ఈఓలు, హార్టికల్చర్ కన్సల్టెంట్లు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, మ్యాక్స్ సొసైటి అధ్యక్షులు సిగ్గ కొండలరావు, ఉపాధ్యక్షులు గాం సింహాచలం, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల లైజన్ వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ఆప్కాస్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:ఏపీ టూరిజంలో పనిచేస్తున్న ఆప్కాస్ ఉద్యోగస్తులకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని అరకులోయ సందర్శించిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ చైర్మన్ కు ఆప్కాస్ ఉద్యోగులు మంగళవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కిల్లో వనాది మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ విశాఖపట్నం డివిజన్ అరకులోయలో ఆప్కాస్ ఉద్యోగులుగా 2007 సంవత్సరం నుండి ఇప్పటి వరకు సుమారుగా 17 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యాటక శాఖను నమ్ముకొని తమ కుటుంబాలు అధారపడి జీవిస్తున్నామన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, పిల్లల ఫీజులు పెరిగాయని, ఇప్పుడున్న వేతనాలతో కుటుంబ పోషణ చాలా భారంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.2023 సంవత్సరంలో కాంట్రాక్ట్, డైలీవెజ్ వారికి జీతాలు పెంచారని, ఆప్కాస్ ఉద్యోగులకు పెంచలేదన్నారు. ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ ఉద్యోగులు పాల్గొన్నారు

మద్యం పాలసీని మార్చండి

వైసిపి ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్

ప్రజాశక్తి -చింతపల్లి: మద్యం పాలసీని మార్చి పేద, మధ్య తరగతి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని వైకాపా ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెల్లి సుధాకర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, నూతన మద్యం విధానం బడా బాబుల జీవితాలకు వరం గానూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు శాపం కానుందన్నారు. తక్కువ ధరలో మద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించడం బాధాకరమన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబీకులు అధికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ విధానం సరికాదన్నారు. అదే క్రమంలో నూతన మద్యం విధానంతో తగ్గిన మద్యం ధరలు కూడా పేద, మధ్య తరగతి కుటుంబాల పై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదన్నారు. తక్కువ ధరలకు మద్యం లభించడంతో మద్యం ప్రియులు మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదన్నారు. దీంతో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యే పరిస్థితి కనిపిస్తుందన్నారు.గత వైసిపి హయాంలో ప్రభుత్వానికి ఆదాయం రాకున్నా ప్రజల స్థితిగతులు కొంతైనా మెరుగు పరచాలని ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేస్తే, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మద్యం ధరలు తగ్గించి మద్యం ప్రియులను పెంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

నేరాలు ఘోరాలు

15 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - చీడికాడ : స్కూటీపై గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డ ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై బి.సతీష్ తెలిపారు. మండలం వరాహపురం గ్రామం వద్ద స్కూటీపై ముగ్గురు 15 కేజీల గంజాయి తరలిస్తున్నట్లు ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి సెల్ ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

తాపీ మేస్త్రి ఆత్మహత్య

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం మేడివాడ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి గంటా కృష్ణ(36) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాగుడుకు బానిసైన కృష్ణను భార్య దేవి మందలించడంతో మనోవేదనకు గురై పక్కనే ఉన్న పెంకుటిల్లులో దూలానికి ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై రావికమతం ఎస్ఐ రఘువర్మ అందించిన వివరాల మేరకు మేడివాడ గ్రామానికి చెందిన గంటా కృష్ణకు అదే గ్రామానికి చెందిన దేవితో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు ఆడపిల్లలు వున్నారు. కృష్ణ మద్యానికి బానిసయ్యాడు. భార్య పిల్లలు కుటుంబ సభ్యులను పట్టించుకోపోవడంతో భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసాడు. మద్యం మత్తులో వున్న భర్తను ఆరోగ్యం పాడుచేసుకోవద్దని భార్య మందలించింది. దీంతో ఆగ్రహించి పక్కన ఉన్న పాత పెంకిటిల్లులో దూలం కు వూరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం సత్తిబాబు భార్య లక్ష్మి తమ ఇంటిలో కృష్ణ మతదేహన్ని చూసి చుట్టుపక్కల వారికి తెలియజేసింది. ఈ సంఘటనపై భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై రఘువర్మ కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది శివాలయం వద్ద గుర్తు తెలియని సాధువు మృతి చెందారు. స్థానిక శివాలయం వద్ద సాధువులు రోజు భిక్షాటన చేస్తుంటారు. యథావిధిగా భిక్షాటన ముగించుకుని శివాలయం వద్ద నిద్రపోయిన సాధువు, మంగళవారం తెల్లవారే సరికి మృతి చెందినట్లు గుర్తించారు. మృతునికి స్థానిక పంచాయతీ ఈవో లోవరాజు దహన సంస్కారాలు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో దివీస్ ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి -తగరపువలస: భీమిలి మండలం, చిప్పాడ దివీస్ ఉద్యోగి మంగళవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం..తూర్పు గోదావరి జిల్లా, గొల్లప్రోలు మండలం, దుర్గాడకు చెందిన ఎస్.రాంబాబు (28) సోమవారం రాత్రి షిఫ్ట్ విధులు ముగించుకుని మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై దివీస్ నుంచి తగరపువలస వెళుండగా సిటీ నగర్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించ బోయి ట్రాక్టర్ వెనుక భాగాన్ని ఢీ కొని రోడ్డుపై తూలిపడ్డారు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-గొలుగొండ:పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కే.లోకనాథం డిమాండ్ చేశారు. మంగళవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో సిపిఎం మండల కమిటీ సమావేశం కామ్రేడ్ సాపిరెడ్డి నారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ, గొలుగొండ మండలంలో బంజర, ఇనాం, ఇతర ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి సాగులో ఉన్న పేదలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేపట్టే సర్వేలో సాగులో ఉన్న పేదల పేరున సర్వే చేసి రికార్డులో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పేదల భూములు అక్రమదారులకు అగమేఘాలపై రికార్డులో మారుతున్నా పేదల వరకు వచ్చేసరికి ఆ పని జరగలేదని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.కోటేశ్వరరావు మాట్లాడుతూ, నిత్యావసరాల సరకుల ధరలు ఆకాశానికి అంటాయన్నారు. ధరలను అరికట్టకపోతే సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడతారన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు అడిగర్ల రాజు, శివ, బాలరాజు, బెన్నేష్, జోగిరాజు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతకు సీతారాం ఏచూరి ఆదర్శం

ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : విలువలకు కట్టుబడిన నిష్కళంక నాయకునిగా, ఆదర్శ పార్లమెంటేరియన్‌గా, అనునిత్యం ప్రజాభ్యున్నతికి పాటుపడిన వ్యక్తిగా సిపిఎం నేత సీతారాం ఏచూరి నేటి యువతకు ఆదర్శప్రాయంగా నిలిచారని ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం విభాగం ఆచార్యులు, జపాన్ ఇన్ఫర్మేషన్ స్టడీసెంటర్ డైరెక్టర్, ఎయు మీడియా రిలేషన్స్ డైరెక్టర్ ఆచార్య చల్లా రామకృష్ణ అన్నారు. మంగళవారం స్టీల్‌ప్లాంట్ సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, మధు, అప్పలనాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిఆర్‌బి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తర్లువాడ సర్పంచ్, మాజీ ఎంపిటిసి బిఆర్‌బి నాయుడు జన్మదిన వేడుకలను మంగళవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో ఘనంగా నిర్వహించారు. మండల నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాంద్రంకి అప్పలరాజు, మద్ది శేఖర్, గణేష్ పాల్గొన్నారు

రేపు కోలాటం పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గంటా నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 10న సాయంత్రం 4గంటలకు స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో మండలస్థాయి కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎన్ హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతి. సంప్రదాయాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కోలాటం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు

డిమాండ్ల సాధనకు పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి -కరాస/ మాధవధార : తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ విశాఖపట్నం పిఎఫ్ రీజినల్ కార్యాలయం వద్ద మంగళవారం ఎపిఆర్ పిఎ సంఘ సభ్యులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్యరాజు ముఖ్యఅతిథిగా హాజరుకాగా, యువిఎస్ఎన్ వర్మ, కె.దీనబంధు అధ్యక్షతన ముందుగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే హుస్సేన్ ఆధ్వర్యంలో ఇటీవల అమరులైన సీతారామ ఏచూరి, కవి రచయిత గాయకుడు, బిహెచ్‌పివి విశ్రాంత ఉద్యోగి సన్యాసిరావు, నాగేశ్వరరావు చిత్రపటాలకు నివాళులర్పించారు.

అనంతరం యువిఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి 15ఏళ్లుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేని నేపథ్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు మాట్లాడుతూ దేశవ్యాప్త ధర్నాలకు కేంద్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రంలోని అన్ని పిఎఫ్ ఆఫీసుల వద్ద ధర్నా చేస్తున్నామన్నారు. కనీస పెన్షన్ రూ.9వేలు అమలు, దానికి డిఎ అనుసంధానం చేస్తూ హయ్యర్ పెన్షన్ అమలు, పెన్షనర్ దంపతులకు వైద్య సదుపాయం, కరోనా సమయంలో తీసేసిన రైల్వే రాయితీ పునరుద్ధరణ, రేషన్ షాపుల ద్వారా తొమ్మిది రకాల నిత్యవసర వస్తువులను సరఫరా, అందరికీ రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు జారీ,తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెన్షనర్లు దేశవ్యాప్త ఆందోళనలు చేస్తున్నారన్నారు.అనంతరం పిఎఫ్ కమిషనర్‌ను కలిసి ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సమస్యలు, పెండింగ్ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ చెల్లించిన రూ.600 కోట్లుకు సంబంధించి పెన్షనర్లకు ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందించట్లేదని, హిందుస్థాన్ షిప్ యార్డ్,ఇతర ప్రభుత్వ రంగ పరిశ్రమల పెన్షనర్లకు నోటీసులు ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. దీనిపై పిఎఫ్ కమిషనర్ స్పందిస్తూ, స్టీల్ ప్లాంట్ పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్‌పై అభ్యంతరం తెలుపుతూ జోనల్ పిఎఫ్ ఆఫీస్ సమాచారం అందించారన్నారు. దీనిపై కేంద్ర పిఎఫ్ కార్యాలయం నుంచి స్పష్టమైన సమాచారం వచ్చిన తర్వాత తెలియజేస్తామన్నారు. హిందుస్థాన్ షిప్‌యార్డు యాజమాన్యం గతంలో 12శాతం పిఎఫ్ కట్ చేయాల్సి ఉండగా. 10 శాతం మాత్రమే కట్ చేశారని, దీనిపై కోర్టులో కేసు ఉన్నందున వారికి నోటీసులు పంపలేదన్నారు. జింక్ పెన్షనర్ల సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆర్‌టిసి పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామన్నారని యూనియన్ నేతలు వెల్లడించారు.

పిఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

ఉపశమన సంరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి -మధురవాడ: పాలియేటివ్ కేర్ (ఉపశమన సంరక్షణ)పై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వెంకటేషన్ తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేసారు. వివిధ అనారోగ్యాలతో జీవితపు చివరి దశలో ఉండే వారికి ఉపశమన సంరక్షణ అవసరమన్నారు. ఏటా ప్రపంచ వ్యాప్తంగా 56.8 మిలియన్ల మంది రోగులకు ఉపశమన సంరక్షణ అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందన్నారు. రోగులు, వారి సంరక్షకులు మానసికంగా కుంగిపోకుండా ఉండడానికి ఉపశమన సంరక్షణ చర్యలు ఉపయోగపడతాయని వెల్లడించారు. దీనికి నర్సింగ్ వృత్తిలో ఉండేవారి పాత్ర కీలకమన్నారు. శిక్షణ కార్యక్రమంలో నిపుణులు డాక్టర్ కరణ్వీర్‌సింగ్ మాత్రో, డాక్టర్ వి.అనూష, పి. తనూజ, ఎస్.వి.ఎల్. పద్మకుమారి, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణను ప్రారంభిస్తున్న జిమ్సర్ ప్రో విసి ఆచార్య గీతాంజలి

50 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవనగర్‌లోని ఒక ఇంటిలో నిల్వ ఉంచిన 50కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్, దువ్వాడ పోలీస్‌లు మంగళవారం వేకువజామున పట్టుకున్నారు. పక్కాగా అందిన సమాచారం మేరకు దువ్వాడ పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆ ఇంటిపై దాడి చేసి, ఏడుగురు నిందితులను, ఒక బాలికను అదుపులోకి తీసుకున్నారు. ఆ ఇంటిలో నిల్వ ఉంచిన 50 కిలోల గంజాయిని పట్టుకున్నారు. నిందితుల నుంచి ఒక ఆటో, మూడు మోటార్ సైకిల్స్ , ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, ఏడుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. బాలికను జువైనల్ హోంకు తరలించారు. నిందితుల్లో ఇద్దరు మహిళలకు ఒడిశాకు చెందిన వారుకాగా, మిగిలిన వారిలో ఇద్దరు అల్లూరి జిల్లాకు, మరో ముగ్గురు అనకాపల్లి జిల్లాకు ఒకరు తూర్పుగోదావరిజిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

వైద్యానికి ఆర్థిక సాయం అందజేత

ఆర్థికసాయం అందజేస్తున్న సుభాష్

ప్రజాశక్తి-ఆనందపురం: గుండె, కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న మండలంలో రేగానిగూడెం గ్రామానికి చెందిన రేగాని రామన్నకు మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ మంగళవారం రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. సీఫుడ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న రామన్నకు ఇటీవల గుండె, కిడ్నీలకు రక్త ప్రసరణ వ్యవస్థ దెబ్బతినడంతో విజయనగరం శ్రీరామమూర్తి ఆసుపత్రిలో చేరాడు. రామన్న వైద్యానికి అధికమొత్తంలో డబ్బులు అవసరమౌతాయని వైద్యులు చెప్పడంతో విషయాన్ని తెలుసుకున్న ఘట్టమనేని సుభాష్ తనవంతుగా రూ.50వేలు ఆర్థికసాయాన్ని బాధితుని కుటుంబసభ్యులకు అందజేశారు మెరుగైన చికిత్స అందించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో బోస్, కుమార్‌స్వామి పాల్గొన్నారు

గీతం సైన్స్ డీన్‌కు ప్రతిష్టాత్మక ఐజియు అవార్డు

ప్రజాశక్తి -మధురవాడ : ప్రఖ్యాత భూభౌతిక శాస్త్రవేత్తలకు ఇండియన్ జియోఫిజికల్ యూనియన్ (ఐజియు) ఏటా ప్రకటించే ప్రతిష్టాత్మక 'హరినారాయన్ లైఫ్ టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డు -2024'కు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ ఎంపికయ్యారు. మెరైన్ జియోఫిజిక్స్‌లో జరిపిన విశిష్ట పరిశోధనలను గుర్తిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు జాతీయ స్థాయి సెలక్షన్ కమిటి ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్‌లో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో జరగనున్న ఐజియు 61వ వార్షిక సమావేశాలలో ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణకు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందజేయనున్నారు.

సముద్ర శాస్త్ర అధ్యయనాలలో 42ఏళ్ల సుదీర్ఘ బోధన, పరిశోధన అనుభవం గల ప్రొఫెసర్ కృష్ణ అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సహ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (గోవా)లలో పనిచేశారు. అలాగే ఒఎన్‌జిసి, గెయిల్, డిజిహెచ్ వంటి ప్రఖ్యాత సంస్థలకు హైడ్రోకార్బన్ నిల్వలను వెలికితీయడంలో శాస్త్రీయ సహకారం అందించారు. ప్రొఫెసర్ కృష్ణ చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డుతో పాటు జెసి బోస్ నేషనల్ ఫెలోషిప్‌లను అందుకున్నారు. ఐజియు అవార్డుకు ఎంపిక కావడం పట్ల ప్రొఫెసర్ కృష్ణ స్పందిస్తూ భవిష్యత్తులో శాస్త్ర విజ్ఞానాన్ని మరింతగా విస్తరించడానికి ప్రోత్సాహకరంగా ఈ అవార్డు ఉపయోగపడుతుందన్నారు. కాగా ప్రతిష్టాత్మక అవార్డుకు ప్రొఫెసర్ కృష్ణ ఎంపిక కావడం పట్ల ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతంరావు, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి హర్షం వెలిబుచ్చి, అభినందించారు.

ధరాభారంపై నిరసన

ప్రజాశక్తి- తగరపువలస : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నిరసిస్తూ సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వై జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కమిటీ నాయకులు రవ్వ నరసింగరావు మాట్లాడుతూ, ప్రజలు నిత్యం వాడే ఉప్పు, బియ్యం, పప్పు, వంటనూనె, ఉల్లి, టమోటా ఇలా నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అలాగే పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం రాము, జీరు సత్యారావు, పల్లా పెంటరాజు, పల్లా రమణ, డి శివ, రామకృష్ణ పాల్గొన్నారు

ఆనందపురం: పెరిగిపోతున్న ధరలను నియంత్రించాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం ఆనందపురం జంక్షన్‌లో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు రవ్వ నర్సింగరావు, నాగరాణి మాట్లాడుతూ నిత్యవసరాల ధరాభారంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరమైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్, నిత్యావసరాల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నేతలు ముద్దాడ రాము, పల్లపెంటరాజు, ఒ.ప్రమీల, నారాయణమ్మ, శివ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆనందపురంలో రాస్తారోకో నిర్వహిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

విశాఖ కలెక్టరేట్ : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, సిఐటియు జగదాంబ జోన్‌కమిటీల ఆధ్వర్యాన పూర్ణామార్కెట్ జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం 'బంగారు వర్ణ కూరగాయల'తో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జోన్ కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ, బండెడు డబ్బులు పట్టుకొని మార్కెట్‌కు వెళితే సంచెడు కాయగూరలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వందరోజులకే ప్రజలకు చుక్కలు చూపిస్తుదన్నారు. సిఐటియు నాయకులు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన ధరలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఐద్వా నాయకులు వరలక్ష్మి, అన్నపూర్ణ సరోజిని, సిఐటియు నాయకులు ఎం. సుబ్బారావు, వై.రాజు పాల్గొన్నారు.

పరవాడ: నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన మంగళవారం పరవాడ సంతలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ ధరలు ఇలా మండిపోతుంటే పేదలు, సామాన్యులు ఎలా కొనుక్కొని తింటారని ప్రశ్నించారు.తక్షణమే ప్రభుత్వం నిత్యావసర సరుకులను అదుపు చేయడంపై దృష్టి పెట్టాలని,కోరారు.